సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 50.995 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 50.995 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 600, ఉత్తరకాలువకు 5, దక్షిణకాలువకు 10వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.76,310
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,923
3శాతం జీఎస్టీతో	రూ.7,131
సవర (8గ్రా)	రూ.57,048

గరిష్టం/కనిష్టం
39.1 /29.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం శనివారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం గాలిలో తేమ 56 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

23లోగా పంటలను నమోదు చేయించాలి

• జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన రైతులందరూ ఈ నెల 23వ తేదీలోగా పంటల నమోదు, ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఖరీఫ్ పంటల నమోదు, ఈ–కేవైసీల కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ పంటలకు ఈ క్రాప్ నమోదు నూరు శాతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రాప్ బుకింగ్ అనంతరం 24వ తేదీ వరకు గ్రామాల్లో జాబితాలను ప్రచురించి, సభలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి గురవప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న డాక్టర్ కె.సునీత

వెంకటాచలం: విద్యార్థుల్లో ప్రతిభ ఉంటే ఉద్యోగావకాశాలు విస్తృతంగా లభిస్తాయని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల ప్రతినిధులు 271 మంది విద్యార్థులతో ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించగా వారిలో 69 మందిని ఎంపిక చేసుకున్నారు. డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇలాంటి వేదికలు చాలా ఉపయోగపడుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ సమన్వయకర్త డాక్టర్ జె.విజిత, వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్. విజయ, ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీఓ వినీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈనెల 28వ తేదీ వరకు గడువు పెంచినట్లు డీఈఓ పీవీజేరామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను వ్యక్తిగతంగా లేదా ఏపీ ఆన్‌లైన్, లేదా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పంపవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగులకు 22లోగా బదిలీలు

నెల్లూరు సిటీ: జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెండు సంవత్సరాలుగా ఒకే స్థానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 22వ తేదీ లోపు బదిలీలు నిర్వహించాలని జిల్లా అధికారులకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ కార్యదర్శి సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయా ఉద్యోగులు తెలుగుదేశం పార్టీ నాయకుల సిఫార్సు లేఖల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లా సీనియర్ మహిళా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక రేపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఉదయం 7 గంటలకు జిల్లా సీనియర్ మహిళా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక జరుగనుందని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణుల జిల్లా జట్టు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సీనియర్ మహిళా స్టేట్ లెవల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందన్నారు. ఎంపికలకు క్రీడాకారిణులు తమ ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరుకావాలన్నారు. వివరాల కోసం 94407 42002 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఒక్క కనెక్షన్ ఇస్తే ఒట్టు!

వ్యవసాయ రంగంలో పంపుసెట్ల ద్వారా పంటలను సాగు చేయాలంటే విద్యుత్ ప్రధానం. వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడేది పంపుసెట్ల ద్వారా అందే నీరే. జిల్లాలో సాగవుతున్న వరి, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలనూ వ్యవసాయ పంపుసెట్ల కింద రైతులు విరివిగా సాగు చేస్తున్నారు. వీటన్నింటికీ విద్యుత్ సరఫరా కీలకమైనా వాటి కనెక్షన్ల మంజూరులో అధికారులు విపరీత జాప్యం చేస్తున్నారు.





• వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో విపరీత జాప్యం
• మూడు నెలలుగా రైతుల ఎదురుచూపులు
• జిల్లాలో 2,357 దరఖాస్తుల పెండింగ్
• మెటీరియల్ లేకపోవడమే ప్రధాన కారణం
• అవస్థలు పడుతున్న అన్నదాతలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): వర్షాభావ పరిస్థితులతో పాటు సాధారణ రోజుల్లోనూ పంటల సాగులో వ్యవసాయ మోటార్ల వినియోగం జిల్లాలో బాగా పెరిగింది. అంతటి ప్రాముఖ్యత ఉన్న వ్యవసాయ మోటార్లకు కావాల్సిన విద్యుత్ సర్వీసు కనెక్షన్లను వెంటనే మంజూరు చేయకుండా విద్యుత్ శాఖ నెలల తరబడి పెండింగ్‌లో పెడుతోంది. దీంతో రైతులు పంటల సాగులో ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా విద్యుత్ శాఖ అధికారులు ఒక్క వ్యవసాయ విద్యుత్ సర్వీసును కూడా మంజూరు చేయకపోవడంతో కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న 2,357 మంది రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కనెక్షన్లు మంజూరు చేయకపోవడానికి ప్రధాన కారణం ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, వైర్లు (మెటీరియల్) అందుబాటులో లేకపోవడమేనని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ శాఖకు చెందిన స్టోర్ గూడూరులో ఉంది. అక్కడి నుంచే జిల్లాకు చెందిన మెటీరియల్ సరఫరా అవుతుంది. అయితే ఈ స్టోర్‌లో మెటీరియల్ లేకపోవడంతోనే వ్యవసాయ సర్వీసులను నిలిపివేసినట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన మెటీరియల్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేది. ప్రతి నెలా కోటా ప్రకారం ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు సీనియార్టీ ప్రకారం జిల్లా రైతులకు వెంటనే కనెక్షన్‌లు ఇస్తుండేవారు. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. మెటీరియల్ లేకపోవటంతో ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వలేని పరిస్థితి. దీంతో తమకు ఎప్పుడు ఇస్తారో తెలియక వేలాది మంది అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఎలా దరఖాస్తు చేయాలంటే..

సాధారణంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసు పొందాలంటే రైతులు సంబంధిత ఓల్టా, వీఆర్వో, బోర్‌వెల్ ధ్రువీకరణ పత్రాలతో మీ–సేవ కేంద్రాల్లో రూ.150 రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకుంటారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ, డీఈఈ, ఈఈల స్థాయిలను బట్టి అనుమతులు వస్తాయి. వెంటనే సంబంధిత రైతులు ఒక హెచ్‌పీ (హార్స్ పవర్)కి రూ.1,200 చొప్పున ఎన్ని హెచ్‌పీలు కావాలనుకుంటే అన్ని రూ.1,200 తోపాటు రూ.40 సెక్యూరిటీ డిపాజిట్ విద్యుత్ సంస్థకు చెల్లించాలి. సర్వీసులు మంజూరు చేసిన తరువాత కావాల్సిన ప్రాంతం నుంచి విద్యుత్ లైన్ దూరాన్ని బట్టి మూడే స్తంభాలు, 180 మీటర్ల ఎల్‌టీ లైన్, ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఉచితంగా ఆ శాఖ అందిస్తుంది. కొన్ని సందర్భాల్లో ఇద్దరు, ముగ్గురు రైతులు ఒకే దగ్గర ఉంటే వారందరికీ కలిపి ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు. అయితే అదనపు స్తంభాలు, 180 మీటర్ల మించి ఎల్‌టీ లైన్ కావాలంటే నిబంధనల ప్రకారం రైతులు అదనంగా నగదును సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది.

నిబంధనలకు విరుద్ధంగా..

వ్యవసాయ విద్యుత్ సర్వీసు మంజూరు అయినప్పటికీ స్తంభం, లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు మొత్తం సంస్థ చేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయించాలి. అందుకు బిల్లులు సంస్థ చెల్లించడం జరుగుతుంది. అయితే కొన్నిచోట్ల కొందరు ఆ శాఖ అధికారులు, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా స్తంభాల ఏర్పాటు కోసం రైతుల చేత గుంతలు తీయించడం, ట్రాన్స్‌ఫార్మర్లను వారి ద్వారా రవాణా చేయించడం జరుగుతోంది. అన్ని ఏర్పాట్లను రైతులు చేసినా చివరకు బిల్లులకు చెందిన నగదును కాంట్రాక్టర్ ఖాతాలో జమ చేస్తూ, ఆయనతో ములాఖత్ అయ్యి పర్సెంటేజీలు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా జిల్లా విద్యుత్ ఉన్నతాధికారులు పరికరాలను స్టోర్స్‌లో అందుబాటులో ఉంచి సత్వరమే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

మోసం చేసిన ఏఈ..

ఆత్మకూరు: విద్యుత్ శాఖ రూరల్ ఏఈ వెంకటేశ్వర్లు గురువారం సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. గతంలో మర్రిపాడు ఏఈగా పనిచేసిన కాలంలో 20 మంది రైతుల వద్ద వ్యవసాయ కనెక్షన్లు ఇస్తానని నగదు వసూలు చేసినట్లు ఇతనిపై ఆరోపణలు ఉన్నాయి. కొందరు రైతులను విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలని ఏఈ చెప్పడంతో వారే సొంతంగా సవక కర్రలు ఆధారంగా మోటార్లకు కనెక్షన్ ఇచ్చుకున్నారు. అయితే రికార్డుల్లో రైతులకు విద్యుత్ కనెక్షన్ల కోసం మెటీరియల్ కావాలని నమోదు చేసి స్టోర్ రూము నుంచి పరికరాలను తీసుకొని వెళ్లారు. క్షేత్రస్థాయిలో అవి కనబడడం లేదు. వీర్లగుడిపాడు గ్రామంలో రొయ్యల గుంతల రైతులు రూ.18 వేలు వ్యవసాయ కనెక్షన్ కోసం చెల్లించినా ఏఈ వారికి మెటీరియల్ ఇవ్వలేదు. రూ.3 లక్షల విలువగల విద్యుత్ పరికరాలు స్టోర్స్ నుంచి ఆయన తీసుకుని పక్కదారి పట్టించారు.



గూడూరులోని విద్యుత్ పరికరాల కార్యాలయం

నెలల తరబడి తిరిగినా ఫలితం లేదు




పంట పొలాలకు నీటి కోసం మా అమ్మ పేరుతో మోటార్ ఏర్పాటుకు విద్యుత్ కనెక్షన్ తీసుకొనేందుకు ఏఈని సంప్రదించా. నగదు కట్టించుకున్నా, మూడు నెలలకుపైగా తిరిగినా కనెక్షన్ ఇవ్వలేదు. నాతోపాటు మరో ముగ్గురు రైతులు గ్రామంలో ఆయన వల్ల ఇబ్బందులు పడ్డాం.

– కృష్ణారెడ్డి, రామస్వామిపల్లి, ఆత్మకూరు మండలం

రూ.100 కోట్ల ఇసుక దోపిడీ స్కెచ్‌కు అడ్డుకట్ట

• పెన్నాలో డ్రెడ్జింగ్ పనులు నాలుగు వారాల పాటు నిలిపివేసిన న్యాయస్థానం
• అర్హత లేని వారికి పనులు కట్టబెట్టడంపై అధికారులకు అక్షింతలు
• యంత్రాల ద్వారా డ్రెడ్జింగ్ రూల్స్‌కు విరుద్ధమని వ్యాఖ్య





పెన్నా నదిలో ఇసుకను పడవలో లోడ్ చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఒక ఐఏఎస్ అధికారి ఎమ్‌ప్యానల్ కమిటీ చైర్మన్‌గా ఉండి అర్హత లేని వారికి ఇసుక డ్రెడ్జింగ్ పనులను అప్పగించడంపై హైకోర్టు కన్నెర్ర చేసింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పిందే వేదమని పనిచేస్తే ఉన్నతాధికారులు అభాసుపాలవ్వాల్సి వస్తుందని పేర్కొంది. ఏపీ కో–ఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్, ఏపీ మైన్స్ అండ్ మినరల్స్ కాన్సషన్ రూల్స్ 1966కి విరుద్ధంగా పనుల అప్పగింతను నిలిపి వేయాలంటూ న్యాయస్థానం ఆదేశించింది.

జరిగిందిలా..

పెన్నా నదిలో డీ సిల్టేషన్‌తో ఇసుక దోపిడీ చేసేందుకు ఎమ్మెల్యేలు తెరచాటు రాజకీయం చేసి ఇరిగేషన్ అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. నెల్లూరు, సంగం, పొదలకూరు మండలంలోని సూరాయపాళెం వద్ద డ్రెడ్జింగ్ ద్వారా డీ సిల్టేషన్ చేసి ఇసుకను తరలించి స్టాక్ పాయింట్ వద్దకు రవాణా చేసేలా పథకం రచించారు. దీనికి ఎమ్‌ప్యానల్ కమిటీ ఆమోదించి గత నెల 23న పత్రికా ప్రకటన ద్వారా ఇసుక డీ సిల్టేషన్‌కు టెండర్లు ఆహ్వానించారు. అర్హత ఉన్న బోట్స్‌మాన్ సొసైటీ నుంచి టెండర్లు ఆహ్వానించి అదే నెల 27న ఓపెన్ చేశారు.

అర్హత లేకున్నా..

పెన్నా నది నుంచి డ్రెడ్జింగ్ విధానంలో ఇసుకను తరలించే క్రమంలో సొంత సైన్యం చేత పెన్నా నుంచే అక్రమ రవాణా చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే అనుచరులు రంగంలోకి దిగారు. రూ.100 కోట్ల విలువైన ఇసుకను దోపిడీ చేసేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుని ఆ విధమైన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. టెండర్ల ప్రక్రియలో పాల్గొనేందుకు స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన పాత్రధారులు రంగంలోకి దిగారు. జిల్లా కో–ఆపరేటివ్ సొసైటీలకు సంబంధించిన సహకారి అధికారి వద్ద సొసైటీకి అనుమతులు లేకుండానే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సొసైటీని రిజిస్ట్రేషన్ చేయించుకుని టెండర్ల ప్రక్రియలో పాల్గొనేలా చేశారు. అనుమతి పత్రాలు పక్కాగా పరిశీలించకుండానే ఎం ప్యానల్ కమిటీ వారిని ఓకే చేసేసింది. దీంతో అర్హత లేని వారు రంగంలోకి దిగి ఇసుక దోపిడీ చేసే ప్రక్రియ ప్రారంభించారు.

నాలుగు వారాల పాటు నిలిపివేత

రూల్స్‌కు విరుద్ధంగా కాంపిటెంట్ అథారిటీ నుంచి లైసెన్స్‌లు లేకుండానే ఇసుక తవ్వుతున్నారని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రూల్స్‌కు విరుద్ధంగా ఉండడాన్ని పరిశీలించిన న్యాయస్థానం నాలుగు వారాల పాటు ఎటువంటి వర్క్ ఆర్డర్‌ను జారీ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

యంత్రాలతో పనులు

గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధంగా యంత్రాల ద్వారా పెన్నా నదిలో డ్రెడ్జింగ్ పనులు చేస్తున్నారు. నదీ గర్భంలో యంత్రాల ద్వారా ఇసుక తోడాలంటే పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అలా చేయకుండానే బోట్స్‌మెన్ సొసైటీ పేరిట ఇసుకను తరలింపు పేరుతో యంత్రాల ద్వారా పనులు చేయిస్తున్నారు. దీనివల్ల సంగం బ్యారేజ్‌కు పెనుముప్పు ఉందని హైకోర్టుకు ఫిర్యాదు చేశారు. దీంతో కోర్టు పనులను నాలుగు వారాల పాటు నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

రోగులకు మెరుగైన సేవలందించండి

• నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
• వైద్యులకు కలెక్టర్ ఆనంద్ హితవు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్



వైద్యసేవలపై రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలందించడమే ధ్యేయంగా డాక్టర్లు పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. శుక్రవారం పెద్దాస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఓపీ విభాగాన్ని, రోగులుండే వార్డులను క్షుణ్ణంగా చూశారు. వైద్య సేవల గురించి రోగులను ప్రశ్నించి వివరాలు రాబట్టారు. అనంతరం మెడికల్ కళాశాలలో, ఆస్పత్రిలో మెరుగైన వసతులు, సేవలు కల్పించేందుకు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, హెచ్‌ఓడీలు సమన్వయంతో పనిచేయాలని హితవు పలికారు. ఆస్పత్రిలో బయో మెడికల్ వేస్ట్‌ను సేకరించేందుకు ప్రైవేట్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలన్నారు. బయో వేస్ట్‌ను సక్రమంగా సెగ్రిగేషన్ చేసే బాధ్యత ఆస్పత్రి వారిదేనన్నారు. అప్పుడు మాత్రమే మున్సిపాలిటీ వారు చెత్తను తీసుకెళ్తారన్నారు. బయో వ్యర్థాలు సాధారణ కాలువల్లో కలవకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా 60 శాతం మాత్రమే వైద్యసేవలందిస్తున్నారని, దీనిని 100 శాతం పెంచాలన్నారు. రూ.5 లక్షల లోపు మెడికల్ ఎక్విప్‌మెంట్‌కు తన పర్మిషన్ అవసరం లేదని హెచ్‌డీఎస్, ఆరోగ్యశ్రీ నిధులు వినియోగించుకోవాలన్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్వహణను టెండర్ పాడుకుని పనులు చేపట్టని కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ టెండర్ రద్దు చేసి మళ్లీ పిలవాలని ఏపీఎంఎస్‌డీ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు హెచ్‌ఓడీలు తమకు కావాల్సిన పరికరాల గురించి కలెక్టర్‌కు నివేదించారు. స్పందించిన ఆయన ఎస్టిమేషన్‌లు సిద్ధం చేసి పంపాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తానన్నారు. అంతకుముందు ఐసీఐసీఐ బ్యాంకు వారు సీఎస్‌ఆర్ నిధులతో అందజేసిన రూ.25 లక్షల విలువ చేసే బ్లడ్ కాంపొనెంట్ సెపరేట్ యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. దీనిని అందజేసిన బ్యాంకు ప్రతినిధులు హరీష్, రాజా, విజయకుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.గోవిందు, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.మస్తాన్‌బాషా, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు డా.కళారాణి, డా.సుశీల్, హెచ్‌ఓడీలు డా.నరేంద్ర, డా.గీతాలక్ష్మి, ఆస్పత్రి ఏడీ ఏడుకొండలు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సుధాకర్‌గౌడ్, డాక్టర్లు పాల్గొన్నారు.

అధికారం అండ చూసుకుని...

• మర్రిగుంటలో అక్రమంగా గ్రావెల్ తరలింపు
• గ్రామస్తులు అడ్డుకున్నా లెక్కచేయని అక్రమార్కులు
• ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

కొండాపురం: మండలంలోని మర్రిగుంట పొలాల్లో గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నా ఫలితం లేకుండా పోయింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ట్రాక్టర్ల యజమానులతో మిలాఖత్ అయ్యి వాహనాలను వదిలేశారు. అధికారం అండ చూసుకుని అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గ్రామస్తులు తెలిపిన సమాచారం ప్రకారం.. గతంలో గ్రామంలో లోతట్టు ఇళ్లకు తమ సొంత పొలాల్లోని గ్రావెల్‌ను తోలుకుంటుంటే తెలుగుదేశం నాయకులు అడ్డుకున్నారు. అధికారుల అండదండలతో ట్రాక్టర్‌లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి పదిరోజుల పాటు అక్కడే ఉంచారు. మైనింగ్ అధికారులకు కూడా తెలపడంతో వారు ఆయా వాహనాలకు భారీగా జరిమానా వేశారు. తర్వాత జరిమానా చెల్లించి ట్రాక్టర్‌లను తెచ్చుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామంలో అధికార పార్టీకి చెందిన కొందరు జేసీబీలతో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్లలో తోలుతుండగా సర్పంచ్ గోపీ మరికొందరు అడ్డుకుని కొండాపురం ఎస్సై మహేంద్ర, తహసీల్దార్ సుందరమ్మకు ఫిర్యాదు చేశారు. కొంతమంది పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకుని గ్రావెల్ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను స్వాధీనం తీసుకోకుండా యజమానులతో మాట్లాడుకుని వాటిని వదిలివేశారు. ఫిర్యాదు చేసిన తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పోలీసులు వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో తాము సొంత పట్టా పొలంలో గ్రావెల్‌ను తోలుతుంటే ఎస్సై మహేంద్ర ట్రాక్టర్లను తీసుకెళ్లి స్టేషన్లో ఉంచి రూ.75 వేలు జరిమానా విధించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే శుక్రవారం గ్రావెల్ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోకుండా ముడుపులు తీసుకుని వదిలివేశారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్, గ్రామస్తులు కోరారు. ఈ విషయంపై ఎస్సై మహేంద్రను వివరణ కోరగా స్పందించ లేదు. సీఐ వెంకటనారాయణను సంప్రదించగా విషయం తెలియదని, ఎస్సైను అడగాలని తెలిపారు. తహసీల్దార్ సుందరమ్మను ఫోన్‌లో వివరణ కోరగా తాను నెల్లూరులో కోర్టు పని నిమిత్తం ఉన్నానని, తనకు ఈ విషయం తెలియదని వెల్లడించారు.



మర్రిగుంటలో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న సర్పంచ్, గ్రామస్తులు

క్లుప్తంగా

పోలీసుల పేరుతో దారి దోపిడీ

- రూ.50 లక్షలతో ఓ ముఠా పరారీ
- భూమి కొనుగోలుకు అడ్వాన్స్ ఇచ్చేందుకు వచ్చిన బాధితులు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ముత్తుకూరు: పోలీసుల పేరుతో ఓ ముఠా రెచ్చిపోయింది. భూమి కొనుగోలుకు వచ్చిన వారిని బెదిరించి రూ.50 లక్షలు దారి దోపిడీకి పాల్పడింది. సేకరించిన వివరాల మేరకు.. పాండిచ్చేరికి చెందిన నలుగురు వ్యక్తులు శుక్రవారం సాయంత్రం భూమి కొనుగోలు చేసే నిమిత్తం అడ్వాన్స్ చెల్లించేందుకు కారులో బ్రహ్మదేవి సమీపంలోని ఏపీ జెన్‌కో రోడ్డుకు చేరుకున్నారు. వీరు వస్తున్నట్టు ముందుగానే పసిగట్టిన ఓ ముఠా నకిలీ పోలీసులుగా మారి పల్లిపాడుదిబ్బ – పిడతాపోలూరు కూడలి వద్ద వాహనం, బైక్‌లతో మాటు వేసింది. కొద్దిసేపటికి పాండిచ్చేరి కారును ముఠా సభ్యులు అడ్డగించారు. పోలీసులమని, తనిఖీ చేయాలనే సాకుతో రూ.50 లక్షలున్న బ్యాగ్‌ను లాక్కొన్నారు. వీరి చర్యను ప్రతిఘటించే క్రమంలో ఘర్షణ జరిగింది. అయితే, బాధితులను నెట్టేసి దుండగులు నగదుతో బైక్‌ల్లో ఉడాయించారు. సమాచారం అందుకున్న ముత్తుకూరు ఎస్సై విశ్వనాథరెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నకిలీ పోలీసుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కృష్ణపట్నం సీఐ రవినాయక్‌ను వివరణ కోరగా స్పష్టమైన సమాచారం లేదని చెప్పారు.

హెచ్‌సీలకు ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి

నెల్లూరు(క్రైమ్): ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 24 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఎస్పీ జి.కృష్ణకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.భాస్కర్‌రెడ్డి (ఏఎస్‌పేట), షేక్ రియాజ్ అహ్మద్ (చిన్నబజార్), ఏవీ ప్రసాద్ (సౌత్ ట్రాఫిక్), వై.శ్రీహరిబాబు (పోలీస్ కంట్రోల్ రూమ్), షేక్ జిలానీ (డీటీసీ), వై.మాల్యాద్రి ఆత్మకూరు, బి.మునిరావు (వేదాయపాళెం), పి.రాజగోపాల్ (మనుబోలు), ఎం.వెంకటేశ్వర్లు (ఆత్మకూరు), కేవీఎల్ నరసయ్య (చిన్నబజారు), కె.ఉమామహేశ్వరరావు (సౌత్ ట్రాఫిక్), ఎంవీ రమణారెడ్డి (సీఐడీ), వి.మాధవరావు (వేదాయపాళెం), ఎస్‌కే కరిముల్లా (కొడవలూరు), సీహెచ్ సురేంద్రబాబు (డీఎస్‌బీ), సి.శ్రీధర్‌రావు (వీఆర్, నెల్లూరు), ఎస్.మునికృష్ణయ్య (చిన్నబజారు), షేక్ బాబా (ఇంటెలిజెన్స్, నెల్లూరు), వి.శ్రీనివాసులు (ఆత్మకూరు), తిరుపతి జిల్లాకు చెందిన పి.కృష్ణ, పి.చంద్రయ్య, షేక్ ఖాదర్ మస్తాన్, షేక్ అహ్మద్‌బాషా, సి.వెంకటేశ్వరరావు జాబితాలో ఉన్నారు.

యువకుడి అదృశ్యం



అభినాష్ (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): అప్పుల పాలైన ఓ యువకుడు ఇంట్లో నుంచి అదృశ్యమైన ఘటనపై నెల్లూరు నవాబుపేట శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. వెంకటేశ్వరపురంలో పుష్పాంజలి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె కుమారుడు అభినాష్ బీటెక్ చేశాడు. ఇంటి వద్దనే ఉంటూ స్టాక్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి నష్టపోయాడు. దీంతో అప్పులపాలయ్యాడు. నగదు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు అధికమవడంతో ఈనెల18వ తేదీన ఇంట్లో నుంచి ఎటో వెళ్లిపోయాడు. బాధిత కుటుంబసభ్యులు అభినాష్ కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో నవాబుపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు స్థానిక ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96306, 94407 00010 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పేరొకరిది.. నడిపేది మరొకరు

కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ఇదీ తంతు

- ఇటీవల కమిషనర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- బినామీలు నిర్వహిస్తున్న 46, అద్దె బకాయిలున్న మరో 6 దుకాణాల సీజ్
- మంత్రి ఆదేశాలతో తిరిగి తాళాల అప్పగింత

నెల్లూరు నగరపాలక సంస్థకు ఆదాయ వనరుల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు ఒకటి. వీటి అద్దెల రూపంలో కొంతమేర రాబడి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా షాపు తీసుకునేది ఒకరు.. నిర్వహించేది మరొకరు. చాలా సంవత్సరాలుగా ఇదే పరిస్థితి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇటీవల తనిఖీలు చేసి పలువురిపై కొరడా ఝుళిపించారు.



ఏసీ సెంటర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లో బినామీ పేరుతో నిర్వహిస్తున్న దుకాణం

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో ప్రకాశం పంతులు షాపింగ్ కాంప్లెక్స్, జీవీఆర్ కాంప్లెక్స్, ఎన్‌సీబీ కాంప్లెక్స్ పప్పులవీధి, సుబేదారుపేట, ఏసీ సెంటర్, ట్రంకురోడ్డు, డైకస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో 223 దుకాణాలున్నాయి. వీటిలో 15 ఖాళీగా ఉండగా మరో పదింట్లో సచివాలయ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. 5 షాపులు కూలే స్థితిలో ఉన్నాయి. 3 దుకాణాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 33 దుకాణాల మినహా మిగిలిన 190 దుకాణాల నుంచి అద్దె రూపంలో నెలకు రూ.18 లక్షలు వసూలు చేస్తుంటారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి 33 శాతం అద్దె పెంచడం.. ఆ ప్రకారం వసూలు చేయడం జరుగుతుంది. దుకాణాలున్న ప్రాంతాన్ని బట్టి అద్దె రుసుము నిర్ణయించాల్సి ఉంది. రూ.1,500 నుంచి రూ.50 వేల వరకు అద్దె నిర్ణయించి తీసుకుంటున్నారు.

ఎవరో..

కొన్ని దుకాణాలను ఎవరైతే పాట ద్వారా పొందారో వారు ఆర్థిక పరిస్థితుల వల్లో లేక వ్యాపారం చేసుకోలేకనో లేక ఇతర కారణాలతోనే మరో వ్యక్తికి అద్దెకు ఇవ్వడం జరిగింది. ఇటీవల కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు కమిషనర్ మౌఖిక ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో పరిశీలించగా పలు విషయాలు వెలుగు చూశాయి. దుకాణాలను ఎవరైతే వేలం పాట ద్వారా పొందారో వారు లేకుండా ఇతరులు (బినామీలు) నిర్వహించే షాపులు 46 ఉన్నట్లు గుర్తించారు. ఇతరులకు అద్దెకిచ్చి లక్షల రూపాయల అడ్వాన్స్, అధిక అద్దె వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయాలు తెలిసి కూడా పలువురు రెవెన్యూ అధికారులు మామూళ్లు పుచ్చుకుని మౌనం వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. మరో ఆరు దుకాణదారులు సకాలంలో అద్దె చెల్లించడం లేదని గుర్తించారు. అధిక మొత్తంలో బాకాయిలున్న కారణంగా మొత్తం 52 దుకాణాలను ఇటీవల సీజ్ చేశారు.

మంత్రి వద్దకు..

సీజ్ చేసిన విషయాన్ని పలువురు దుకాణదారులు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఎన్ని దుకాణాలున్నాయి? వాటిని ఎవరికిచ్చారు? ప్రస్తుతం ఎవరుంటున్నారు? తదితర వివరాలను అందజేయాలని కార్పొరేషన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దెకు సంబంధించిన విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుని అందరికీ న్యాయం చేసేలా చూస్తామని ఇటీవల సమావేశంలో చెప్పారు. అలాగే సీజ్ చేసిన దుకాణదారుల నుంచి అద్దె బకాయిలు లేకుండా వసూలు చేసి వారికి తాళాలు అప్పగించాలని మంత్రి సూచించారు. దీంతో రెవెన్యూ అధికారులు నగదు వసూలు చేసి తాళాలు అప్పగించారు.



దుకాణాన్ని సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

సమస్యలను సత్వరమే పరిష్కరించండి : ఎస్పీ



సిబ్బంది సమస్యలను వింటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ డీపీఓ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. 21 మంది సిబ్బంది ట్రాన్స్‌ఫర్స్, వివిధ రిక్వెస్ట్‌లు, ఆరోగ్య సమస్యలు, లోన్లు తదితరాలకు సంబంధించిన సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కృష్ణకాంత్ మాట్లాడుతూ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని, అనధికారికంగా గైర్హాజరైనా, క్రమశిక్షణ ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 120 బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 242
లేయర్ (లైవ్) : 115
బ్రాయిలర్ చికెన్ : 220 లేయర్ చికెన్ : 195

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.100
సన్నవి : రూ.45
పండ్లు : రూ.35

తెలుగుదేశం నేతల ఉన్మాదం

- ఓ వృద్ధుడికి పింఛన్ ఇవ్వాలని కోరిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారైన ముస్లిం వ్యక్తి
- అతడి ఇంటిపై దాడి చేసిన పచ్చమూక
- నగదు అపహరణ, మూడు బైక్‌ల ధ్వంసం
- కేసు పెడితే చంపేస్తామని బెదిరింపులు



పగిలిపోయిన కిటికీ అద్దాలు



బైక్ ట్యాంక్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీకి మద్దతుదారుగా ఉన్న ఓ ముస్లిం వ్యక్తి వృద్ధుడి పింఛన్ విషయమై అడిగినందుకు మీ వర్గం కాని వ్యక్తి కోసం అంత ఆసక్తి ఎందుకు రా.. అంటూ అతడి ఇంటిపై పచ్చమూక దాడి చేసిన ఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలంలోని నారాయణరెడ్డిపేట గ్రామంలో ఎస్‌కే కరిముల్లా, జంషీర్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారు కొత్తకాలువ సెంటర్‌లో జేకే చికెన్‌స్టాల్‌ను నడుపుతున్నారు. కరిముల్లా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు. కోడూరుపాడుకు చెందిన పామూరు రాఘవరెడ్డి తనకు వృద్ధాప్య పింఛన్ రావడం లేదని కరిముల్లా దృష్టికి తీసుకెళ్లగా కార్పొరేషన్ అధికారులు, కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీంతో కోడూరుపాడులో టీడీపీ వర్గానికి చెందిన తగరం మల్లికార్జున కోపోద్రిక్తుడయ్యాడు. కొద్దిరోజుల క్రితం రాఘవరెడ్డిపై దాడి చేశాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో 15వ తేదీన అరుంధతీవాడలోని ఓ పెద్దమనిషి వద్ద పంచాయితీ పెట్టి సర్ది చెప్పారు. మల్లికార్జున అంతటితో ఆగకుండా కరిముల్లాపై కక్ష పెంచుకున్నాడు.

దాడి చేసి..

గురువారం అర్ధరాత్రి మల్లికార్జున 20 మంది అనుచరులతో కలిసి కరిముల్లా ఇంటిపైకి దాడికి వెళ్లాడు. కత్తులు, కర్రలతో అరుస్తూ భయభ్రాంతులకు గురి చేశారు. ఇంటి తలుపులు, కిటికీ అద్దాలు పగులకొట్టారు. బీరువాలోని రూ.16,500 నగదు అపహరించారు. బయట పార్కింగ్ చేసిన మూడు మోటార్‌బైక్‌లను ధ్వంసం చేశారు. కరిముల్లా, అతడి కుమారుడు ఫర్మాన్‌పై దాడికి యత్నించారు. దీంతో కరిముల్లా భార్య, కోడలు, ఇద్దరు చిన్నారులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వచ్చింది. సుమారు రెండు గంటలసేపు పచ్చమూక హల్‌చల్ చేసింది. స్థానికులు ప్రశ్నించగా వారిని కూడా తిడుతూ కత్తులు తిప్పుతూ భయపెట్టారు. తమపై కేసు పెడితే చంపేస్తామని, చికెన్ స్టాల్ ఎలా నడుపుతావో చూస్తామంటూ కరిముల్లాను బెదిరించారు. దీంతో బాధితులు రూరల్ పోలీసులకు చెప్పగా వారు ఘటనా స్థలానికి చేరుకోవడంతో పరారయ్యారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో..

- ఆటోను ఢీకొన్న బైక్
- ఏడాది వయసున్న చిన్నారి మృతి

ఉదయగిరి: మండల కేంద్రమైన ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడాది వయసున్న నాగవేణి అనే చిన్నారి మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తిరుమలాపురం ఎస్టీ కాలనీకి చెందిన వెంగయ్య, వెంగమ్మ దంపతులు తమ కుమార్తె నాగవేణితో కలిసి గురువారం సాయంత్రం మోటార్‌బైక్‌పై ఉదయగిరికి వచ్చారు. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. వ్యవసాయ కళాశాల సమీపంలో ఆటో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వాహనం అకస్మాత్తుగా ఆగిపోయింది. దీంతో వెనుక నుంచి బైక్ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముందు కూర్చొన్న నాగవేణి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి విషమించడంతో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే చిన్నారి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నారి మృతితో ఎస్టీ కాలనీలో విషాదం నెలకొంది. ఎస్సై శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మె కొనసాగిస్తాం : డాక్టర్లు



ధర్నా చేస్తున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): సమస్యలను పరిష్కరించేంత వరకు పీహెచ్‌సీల్లో సాధారణ వైద్య సేవలు ఆపేసి సమ్మెను కొనసాగిస్తామని డాక్టర్లు స్పష్టం చేశారు. శుక్రవారం నెల్లూరులోని వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు వినతిపత్రం అందజేశారు. సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వైద్యశాఖ కార్యాలయం వద్ద డాక్టర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పీహెచ్‌సీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తాము కొన్నిరోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం చర్చలు జరపకపోవడం దారుణమన్నారు. అందువల్ల సమ్మె చేస్తున్నామన్నారు. ఇన్‌సర్వీస్‌లో ఉండే డాక్టర్లకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు జీఓ నంబర్ 85ని రద్దు చేయాలని, ప్రాథమిక వైద్యులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాసులు, కోశాధికారి డా.రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్లు అహ్మద్‌బాబు, నవీన్‌కుమార్‌రెడ్డి, విజయశంకర్ రెడ్డి, బలరామనాయక్, హజరత్‌రెడ్డి, భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీల బాట

- ఎనిమిది కేసుల్లో నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఒకరి కోసం గాలింపు
- 3 కిలోల వెండి, బైక్, మూడు ల్యాప్‌టాప్‌లు, రూ.60 వేలు స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పోలీసులు

నెల్లూరు సిటీ: మద్యం వారిని స్నేహితులుగా మార్చింది.. అందరూ జట్టుగా చేరి దొంగతనాలకు పాల్పడుతున్నారు. పలుమార్లు జైలుకు వెళ్లివచ్చినా తీరులో మార్పు రాలేదు. చోరీలకు పాల్పడుతూనే ఉన్నారు. పోలీసులు వారి కదలికలపై నిఘా ఉంచి అరెస్ట్ చేశారు. నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు నిందితుల వివరాలను వెల్లడించారు. వేదాయపాళెం మహాత్మా గాంధీనగర్‌కు చెందిన కె.సురేష్, పి.కిశోర్, వెంగళరావ్‌నగర్ ఏబ్లాక్‌కు చెందిన జి.సిద్ధూ, బుజబుజనెల్లూరు భగత్‌సింగ్‌కాలనీకి చెందిన పెరుమాళ్ అలియాస్ మహేష్, వనంతోపు సెంటర్‌కు చెందిన కె.విష్ణులు మద్యం తాగే వద్ద పరిచయాలై స్నేహితులుగా మారారు. జల్సాలకు బానిసైన వీరు సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో రెక్కీ చేసి దొంగతనాలకు పాల్పడసాగారు. వరుస చోరీల నేపథ్యంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పర్యవేక్షణలో వెంకటాచలం, నెల్లూరు రూరల్ పోలీసులు, డీఎస్పీ ఐడీ పార్టీ, సీసీఎస్ సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. శుక్రవారం సురేష్, కిశోర్, సిద్ధూ, మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నేరాలివే..

నిందితులను విచారించగా ఈ ఏడాది జూన్ 29వ తేదీ రాత్రి నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో శివాజీకి చెందిన మోటార్‌బైక్‌ను, జూలై 3వ తేదీ రాత్రి పార్థసారథి నగర్‌లో ఓ ఇంట్లో 500 గ్రాముల వెండి వస్తువులను, 5వ తేదీ రాత్రి మాగుంట లేఅవుట్‌లోని ఓ కన్సల్టెన్సీలో ల్యాప్‌టాప్, 15వ తేదీ రాత్రి మనుబోలు గ్రామంలో సబ్ పోస్టాఫీసులో క్యాష్ బాక్స్ చోరీకి యత్నం, 30వ తేదీన తల్పగిరికాలనీలోని ఓ ఇంట్లో 1,300 గ్రాముల వెండి వస్తువులు, ఆగస్ట్ 5వ తేదీ రాత్రి నెల్లూరు రూరల్ మండలం ఆకుతోట సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో రూ.2,81,770, 28వ తేదీన పొదలకూరు గ్రామ మెయిన్ రోడ్డులో నివాసం ఉంటున్న జనార్దనరావు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 750 గ్రాముల వెండి వస్తువులు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఈనెల ఆరో తేదీ రాత్రి వెంకటాచల సత్రం మండల పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణ వాచ్‌మెన్‌పై కత్తులతో దాడి చేసి రూ.2.61 లక్షల నగదు, నాలుగు బీర్ బాటిళ్లను దొంగతనం చేసినట్లు నిందితులు వెల్లడించారు. వారిని అరెస్ట్ చేసి మూడు కేజీల వెండి వస్తువులు, బైక్, మూడు ల్యాప్‌టాప్‌లు, రూ.60 వేల నగదు, సెల్‌ఫోన్, క్యాష్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సొత్తు విలువ రూ.6 లక్షలు ఉంటుందని ఎస్సై తెలిపారు. విష్ణు పరారీలో ఉన్నాడని అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

లెక్కకు మించిన కేసులు

సురేష్, కిశోర్‌పై 20 కేసులు, సిద్ధూపై 11 కేసులున్నాయి. ముగ్గురు నిందితులపై ముత్తుకూరు పోలీసుస్టేషన్‌లో సస్పెక్టెడ్‌షీట్లు ఉన్నాయి. మహేష్‌పై ఎనిమిది కేసులున్నాయి. వీరంతా 24 ఏళ్ల లోపు వారేనని ఎస్సై తెలిపారు.

సిబ్బందికి అభినందన

నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రాబట్టేందుకు కృషి చేసిన డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్, వెంకటాచలం ఇన్‌స్పెక్టర్‌లు వేణు, సుబ్బారావు, ఎస్సైలు లక్ష్మణరావు, ఆంజనేయులు, డీఎస్పీ ఐడీ పార్టీ సిబ్బంది కె.గిరిధర్‌రావు, జి.గంగాధర్, సతీష్, నెల్లూరు రూరల్ సిబ్బంది ప్రసాద్, ఆదినారాయణ, వేణుగోపాల్ తదితరులను ఎస్పీ కృష్ణకాంత్ అభినందించి రివార్డులు ప్రకటించారు.